# వేరు పురుగు

ఆరామం, చిన్న పెద్ద కాకుండా వొక మోస్తరు పెద్ద పల్లెటూరు. ఆ వూరిలోని అన్ని యిళ్లకూ విశాలమైన పెరళ్లు, వాటిలో ఫలవృక్షములు, కూర పాదులు, పూలమొక్కలు, మంచినీళ్ళ బావులు వున్నాయి. అంచేతనే కాబోలు ఆపేరు వొచ్చింది. ఆ వూరికి చిన్న పంచాయతీ బోర్డు, బ్రాంచి పోస్టాఫీసు కూడా వున్నాయి. వూరి తూర్పు సరిహద్దుగా వొక యేటికాలువ ఎల్లప్పుడూ ప్రవహిస్తూ వుంటుంది. వూరికి పడమరగా సుమారు మైలున్నర దూరంలో రాజపురం అనే వొక పట్నం వుంది. ఆ పట్నంలో, పట్నానికి వుండవలసిన కోర్టులు, కచ్చేరీలు, స్కూళ్ళు, హాస్పిటలు, సినీమా హాల్సు, మొదలైన హంగులన్నీ వున్నాయి. సాధారణంగా ఆరామంలోని చాలామంది ఏదో పనిమీదయీ పట్నంలోనే దినములో చాలాభాగం గడుపుతూవుంటారు.

సరవన్న, వురఫు సర్వేశ్వరరావు, ఆ రామంలో వొక గృహస్తు. అతనికి చిన్నతనంలోనే తల్లిదండ్రులు పెళ్లిచేసి వొక యింటివాణ్ణి చేసేరు. పెళ్లయిన కొద్ది రోజులలోనే తల్లిదండ్రు లిద్దరూ గతించేరు. ఆస్తి చేతికిరాగానే కిందూ మీదూ కానకుండా కర్చులుచేసి, దేశదిమ్మరై, కొన్నాళ్ళకి చెల్లని దమ్మిడీలాగ తిరిగీ స్వగ్రామానికి వొచ్చేడు. అప్పటికి మిగిలినది సగం పడిపోతున్నయిల్లు, యెదిగి పుట్టింటిలోనే వుండిపోయిన భార్య. ఆమెను తీసుకుని వెళ్ళమని అత్తవారు పదేపదే బలవంతం చెయ్యడంవల్ల జీవనాధారం యెలాగా అని ఆలోచించేడు. ఆ స్తంతా సున్నచుట్టి దేశాలు తిరగడంవల్ల అతనికి లోకజ్ఞానం బాగాకుదిరింది. పేచీలకు పెదబాబు నారదాంశ బాగా పట్టింది. అతనివద్ద మెచ్చుకోదగినది వక ప్రజ్ఞవుంది. చిన్ననాడు తండ్రి స్వయంగా యింటివద్ద వరవళ్ళు పెట్టె కాపీలు (యింగ్లీషు, తెలుగు) వ్రాయించడంవల్ల, దస్తూరీ ముత్యాల కోవలాగుండేది. రెండుచేతులతోను సాపుగా వ్రాయగలడు. స్కూలు ఫైనలు వరకు చదివేడు. దేశసంచారంవల్ల ఇంగ్లీషు భాషలో మాట్లాడగలడు. యివన్నీ ఆధారం చేసుకుని రాజపురంలో కోర్టులకు, యితర ఆఫీసులకు, మార్కెట్టుకు, దగ్గరగా వొక కొట్టు తీసుకుని డాక్యుమెంటు రైటరుగా పనారంభించేడు. ఎవనిమీదైనా కన్ను వేశాడంటే వాణ్ని యేదో మాయోపాయం చేసి గోతిలో దింపేడన్నమాటే. పొద్దుట లేచిందిమొదలు యెవడిమీద అస్త్రం ప్రయోగించి డబ్బు లాగడమా అని ఆలోచిస్తూనే వుంటాడు. కొద్ది నెలలకే అతడి రాసి బాగుండడంవల్ల సబురిజిస్ట్రారు, పోలీసువారు, మేజిస్ట్రేటు కచ్చేరీ వారు పరిచయస్తులయ్యేరు. కొంత ధనార్జనకూడా చేసి యిల్లు మరామత్తు చేయించి భార్యను తెచ్చుకున్నాడు. అతనిపని బాగుండేది. గ్రామంలో అందరు భయంకొద్దీ అతనిమాట కెదురుచెప్పేవారు కారు. సరవన్న నా వూళ్ళో లక్ష్యపెట్టనివాడు వొకడే. అతనిపేరు పెద్దయ్య. అతనికి కౌలుకింద సుమారు అరవై యకరాల పల్లం తాతలనాటినుండీ వుండేది. అదంతా స్వంతసేరీకింద వుంచుకొనేవాడు. పెద్దయ్య ఇంగ్లీషుచదవకపోయినా, అమరం, ఆంధ్రం బాగా చదువుకుని రెండు భాషల్లోను మంచి జ్ఞానం సంపాదించి తీరిక కలిగినప్పుడల్లా ఏదో గ్రంథమో, పురాణమో చదువుకునేవాడు. తగవులంటే అతని కిష్టంలేదు. ఎవరేనా తనవద్దకు సలహాకి వస్తే సరియైనసలహా యిచ్చేవాడు.

## 2

అది పుష్యమాసం. సంక్రాంతి పండుగముందు. చలిబాగా వేస్తూంది. సరవన్న తెల్లవారకమునుపే లేచి, దుప్పటీ కప్పుకుని చెవులు మూసేటట్టు పాగా చుట్టుకుని, వొక చుట్టముట్టించి, మరొకచుట్ట అగ్గిపెట్టె బనియను జేబులో పెట్టుకుని వూరి బయటకు, కాలవగట్టుకి బయలుదేరుడు. కర్షకులు వరిచేలు కోసి కుప్పలు కళ్ళాలలో వేసి వుత్సాహంగా పాటలు పాడుకుంటున్నారు. సరవన్న కాలకృత్యాలు తీర్చుకుని పండుగ కర్చులకి ఎవరినుండి డబ్బు పిండుదామా అని ఆలోచిస్తూ వక పొలం గట్టుమీదనుంచి నడిచి వస్తూండగా, ఆ గట్టుకి పడమరగా వున్న పొలంగట్టు కొత్తగా వేసినట్టు కనబడింది. తళుక్కున అతని బుర్రలో వొక స్కీము మెరిసింది. తాను నిలుచున్న మడి సన్యాసనే రైతుదని తెలుసును. ఆ సమయానికే కొంతదూరంలో సన్యాసి కనుపించేడు. అతడు తన వైపే వొస్తూండడం చూసి సరవన్న గట్టుదిగి అడుగులు లెక్కపెట్టుతున్నట్టు కనపడేలాగ యీ గట్టు దగ్గర నుంచి ఆగట్టుకీ,అటునుంచి యిటూ రెండు మార్లు నడిచి తిరిగీ గట్టు యెక్కి నిలుచునే సరికి, సన్యాసి కూడా అక్కడికి చేరి, "ఏటి బాబూ! సరవన్న గోరూ! అదేటి పొలం కొలుస్తున్నారాయేటి." అనడిగేడు.

"ఆ!! అలాగే. చూడు సన్యాసీ. యీ పొలం నీదే కదూ. దీనికి పడమర వున్న పొలం యెవరిది?"

"అదా!" అని వేలుచూపుతూ "అది యెంకన్నగోరి సూరన్నది."

"అలాగచెప్పు! ఏమైనా సూరన్న గట్టివాడే. అయినా నా కెందుకీ పిసరుకోసం అక్కర్లేనిగోల" అంటూ చుట్ట నోట్లో పెట్టుకుని అగ్గిపుల్ల వెలిగించాడు.

"ఏటిబాబూ పిసరేటి. నాకేటీ తెలకుండా వుంది. కూంతసెప్పండి బాబూ."

"అబ్బే! ఏమీ లేదు. నిరుడుకొత్తలైంతర వాతయీలాగే వకనాడునీపొలాని కడ్డంగా నడిచేను. యిప్పుడు దూరంనించి చూస్తే వెడల్పు తగ్గిందేమోననిపించి అడుగులు లెక్కపెట్టుకుంటూ, ఎందుకేనా మంచిదని అటూ యిటూ నడిచేను"

"ఏటి తమరు సెప్పేది?"

"ఏం లేదు. చూడూ ఆగట్టు సూరన్న కొత్తగావేశాడా? కొంచెం, మూడడుగులిటొచ్చిందేమో నని అనుమానం"

"అయితే బాబూ! యీ మూడడుగులూ సూరన్న ఆడిపొలంలో కలిపేసుకున్నట్టే?"

"అబ్బే గట్టు వెయ్యడంలో పొరపాటయ్యింటుంది. దానికోసం పెద్ద చర్చ చెయ్యడం నాకిష్టంలేదు సుమీ."

"మూడడుగులు కలిపేసుకుంటే చెర్చొద్దంటారా బాబూ! మనంవొల్లకుంటే

దుల్లీయేటికి మరి మూడడుగులు కలుపుతాడు. తనిరెలాగేనా కటాచ్చించి నాభూమి నాకొచ్చేట్టుసెయ్యాలి బాబూ"

"నాకు తగువులంటే యిష్టం లేదు. అయినా నువ్వు పట్టుదలగా వున్నావు. ఆలోచిస్తాను. పది గంటలకి యింటికిరా చెప్తాను."

వేసిన బీజం నాటిందికదా అని సంతోషిస్తూ, మధ్యదారిలో సూరన్న కళ్లం దగ్గిర కొచ్చి అతణ్ని వెంటనే తనవద్దకి రమ్మని చెప్పి యిల్లు చేరుకున్నాడు. సరవన్న కాఫీ తాగి వీధరుగు మీద కూర్చుని కాయితాలు వ్రాసుకుని, వంటైందని తన అక్కగారు చెబితే స్నానంచేసి భోజనంచేసి, తాంబూలం, చుట్ట సేవించి రాజపురం వెళ్ళడానికి దస్త్రాలు కట్టుకుని సిద్ధంగా వున్నప్పుడు సూరన్న వొచ్చాడు. "దండాలు బాబూ! సరవన్నగోరు. ఏటిసేసం, రమ్మన్నారు?" అన్నాడు.

"ఏమీ లేదు. వొక చిన్న భోగట్టా నిన్నడుగుదామని. చూడూ, నీ పొలం సన్యాసిపొలానికి పడమరగా వున్నదే కదూ?"

"అవును బాబూ."

"దానికీ సన్యాసి పొలానికీ మధ్యనున్న గట్టు నీదేగదూ?"

"కాదే."

"అది కొత్తగా కనబడుతూందే. రిపేరీ చేసేవా ఏంటి."

"పీతలు, ఎలికలు పెద్దకన్నాలెట్టేస్తే గట్టు కూలిపోయి నీరు నిలవలా. అంచేత గట్టంతా మళ్ళా పోసేను బాబూ."

"అంతేనా! మరేమీ లేదుకదా?"

"మరేటుంతది బాబూ! యింతకీ తమరెందు కిదంతా అడుగుతున్నారు. ఏమైనా వుందా యేటి?"

"వుంటేనేం, లేకపోతేనేం. నాకెందుకా ఘోష. నేను పోవాలి. అర్జంటుగా సబురిజిస్టారుగార్ని కలుసుకుని దూపాడు రైతుల దస్తావేజులు రిజిస్టరీ చేయించాలి"

"బాబూ! ఏదో అనే సెల్లిపోతానంటే యెలాగ? అదేటో సెప్పేసెల్లండి."

"అయితే చెప్తాను విను. నువ్వు సన్యాసి పొలంలో నిలువునా వుత్తర దక్షిణాలకు మూడడుగులమేర కలిపేసుకుని కొత్త గట్టు వేశావని అతగాడి అనుమానం. ఏదో పోలీసు రిపోర్టు అంటూవుంటే నేను తారసమై యేమిటని అడిగితే యిదీ కథ. తెలిసిందా. నేను పోవాలి. నువ్వెళ్లు. రాత్రి తొమ్మిది గంటల తరవాత నువ్వు కళ్లాని కెళ్ళేటప్పుడు రా. ఏమైనా విశేషాలుంటే చెప్తాను. నేను తొందరగా పోవాలి."

సూరన్న బీభమలుపుతిరుగుతూ వుండగా సన్యాసి వొచ్చి "ఏటి బాబూ! సూరన్న తవురికాడికొచ్చేడా యేటి? మలుపు తిరుగుతుంటే సూసినాను."

"ఆ! నేనే నీపొలం ఆక్రమణ గురించి భోగట్టా చేదామని రమ్మన్నాను."

"ఏటంతాడు బాబూ?"

"కొత్తగట్టు వేసినట్టు వొప్పుకున్నాడు గాని వొక జానెడైనా నేల కలుపుకోలే దంటాడు."

"తంరేటంతారు?"

"నేననడం యేమిటోయ్! నీ భూమి సూరన్న దురాక్రమణ చేసేడని నీకు నమ్మకం వుంటే, అది మళ్ళీ నువ్వు సంపాదించాలంటే వెంటనే సివిలు, క్రిమినలు చర్యలు జరిపించాలి. నేను పట్నం పోవాలి. నీ కిష్టమైతే యిప్పటికి యాభై రూపాయిలు పట్టుకుని వొక గంటలో పట్నంలో నా ఆఫీసుకురా. నా పనులన్నీ వెనకబెట్టి ముందు నీవిషయమై వకీలునీ, పోలీసు సబినస్పెక్టరుని కట్టుదిట్టం చేస్తాను. మరి నేను వెళ్తా."

"బాబూ! యీ సంగతి పెద్దయ్య సెవి నేత్తే ఏటయినా సేత్తాడేమో."

"అది నీయిష్టం. కాని సూరన్న అలాగ చెప్పుతూవుంటే పెద్దయ్య వింటేస్తాడోయ్. వొస్తే వో గంటలోపున రా. లేకపోతే నీ

# ★ వేరు పురుగు ★

కర్మం. నేను మళ్లా సాయంకాలందాకా దొరకను. వొస్తే యీవాళ్లా నీపనిమీదే తిరగాలి."

"అయితే డబ్బొట్టుకొని వొస్తాను బాబూ."

సరవన్న రాజపురం వెళ్ళి తన కొట్టు తెరిచి కాయితాలేవో రాసుకుంటూ సన్యాసికోసం యెదురుమాస్తూ వుండగా సుమారు గంటన్నర తరవాత అతడు వొచ్చేడు.

"ఏమోయ్! యింతాలిస్యం చేసేవు? డబ్బు తెచ్చేవా?"

"మాయమ్మ మెళ్ళో తీగ కోమటి సుబ్బన్నదగ్గిర తాకట్టెట్టి యాభై తెచ్చేను. ఆ కోమటి గంట తిప్పలుబెట్టి మరీ డబ్బిచ్చేడు బాబూ, అంచేతాలిస్యమైంది."

"ఆడబ్బిలాతే. యిప్పుడు వకీలుగారు కోర్టుకి వెళ్లిపోయుంటారు. మనం ముందు సబిన్స్పెక్టరుగారిదగ్గిర కెళ్దాం."

## 3

పోలీసుస్టేషను బయటి వరండాలో బెంచీమీద సన్యాసిని కూర్చోబెట్టి సరవన్న లోపలికెళ్లి సబిన్స్పెక్టరు సుందర్రావుగారికి నమస్కారం చేసి నిలబడ్డాడు. ఆయన "హల్లో నారదా! ఏం విశేషం? యీలాగొచ్చేవు?" అని పలకరించాడు.

"చిత్తం! వొక చిన్నభూమి తగాయిదాగురించి మీసలహాకోసం వొచ్చేను."

"ఏమిటీ! అది వెట్టా (*wet*), డ్రైయా (*dry*)."

"అట్టే వెట్టూ కాదు. అట్టే డ్రైయీ కాదు. ఓపాళంగా వుంటుంది."

"అంటే?"

"వో పదిలైన్లు కంప్లెయింటు. అడుగో ఆ బెంచీమీద కూచున్నాడు కంప్లెయినెంటు. చిన్నసంసారి. తమరు కటాక్షం చాలి."

"యీపిసరుకి నా టైంవేస్టు చెయ్యలేను. పెద్ద మర్డరుకేసు యిన్వెస్టిగేషనుకి నేను బొంబాయి, కలకత్తా, యింకా అవసరమైతే నార్తిండియా అంతా గాలించి రూపీలు తియ్యాలి. అయినా నువ్వు చెప్పేవు కాబట్టి జీ. డీ.లో నోటుచేస్తాను. ఏం జరిగింది?"

"ఫిర్యాది మామిళ్ల సన్యాసి, సాకీను ఆరామం. వృత్తి వ్యవసాయం. అతని పొలానికి పశ్చిమంగా గరువునూరన్న అనే రైతు తాలూకు పొలం వుంది. అతను తన పొలానికీ సన్యాసి పొలానికీ మందడిగా వున్న గట్టు రిపేరిచేయించేమిషపై కొత్త గట్టువేస్తూ ఫిర్యాదీతాలూకు పొలంలో నిలువునా వుత్తరదక్షిణాలకు మూడడుగుల మేర దురాక్రమణ చేసేడు. అదీ కంప్లెయింటు."

"వోయ్! తొంబైయారూ! ఆ సన్యాసినిలా పిలువు"

వొక కనిస్టేబు "సన్యాసీ! సన్యాసి!" అని పిలిచేసరికి సన్యాసివొచ్చి అందరికీ నమస్కారంచేసి నిలుచున్నాడు.

"ఏమోయ్! నూరన్న అనే ఆసామీ మీ యిద్దరిపొలాలమందడి గట్టు రిపేరు చేయించడం నీకు తెలుసునా?"

"సిత్తం బాబూ తెల్సును"

"అయితే నువ్వప్పుడడ్డేవా?"

"నేదు బాబూ."

"ఎంచేత?"

"ఆడి గట్టాడు బాగు చేసుకుంటే నాకేటని వొల్లకున్నాను."

"మరి యిప్పుడీ తగు వెందుకు?"

"నా పొలంలో కొంత కలుపుకున్నాడని అనుమానం బాబూ."

సరవన్న అప్పుడందుకున్నాడు. "అనుమాన మేమిటి నీ మొహం! నిశ్చయంగా కలుపుకున్నాడు. అడ్డడానికి వెళ్లితే వొక్కణ్ణీ చేసి యీ ఆసామీని నూరన్నా, కూలి వాళ్ళూ నానాదుర్భాషల్తూ ఆడి మెడపట్టి గెంటివేసేరు. అంచేతే తమవద్ద ఫిర్యాదు. అంతేకదూ సన్యాసీ."

సన్యాసి తల గోక్కుంటూ "సిత్తం బాబూ." అన్నాడు.

"సరే సాక్షు లెవర"ని సుందర్రావుగారడిగేసరికి సరవన్న ఎవరివో మూడు పేర్లు చెప్పేడు. సన్యాసి తెల్లబోయి చూస్తున్నాడు. సరవన్న అదివరకే తాను వ్రాసి వుంచిన వో తెల్లకాయితం రావు సరిచేసి సుందర్రావుగారి కిస్తూ "నేను మనవిచేసిన పదిలైనుల గ్రంథం ఆ రావులో వున్నది. తమరు చిత్తగించి తగు శ్రద్ధచేసి దర్యాప్తు జరిగించాలి. శెలవా?"

"సరే! నేనైనా, హెడ్డు వెంకటేశం అయినా వస్తాం."

కోర్టు లంచి టైముకి సరవన్న, సన్యాసి బారు రూం ద్వారందగ్గిర కాసేరు. లాయర్లు వొక రొకరు వొస్తూ వాళ్ళిద్దరినీ చూసి కొంచెంసేపు నిలబడి లోపలికి వెళ్లిపోతున్నారు. ఎడ్వొకేటు సారంగపాణి గారు వొచ్చేసరికి సరవన్న నమస్కారం చేసేడు. సారంగపాణి ఆరునెల్ల కిందట ఎడ్వొకేటుగా ఎన్రోలై రాజపురంలో మునసబుకోర్టు, సబుకోర్టూ వున్నాయని అక్కడ బోర్డు కట్టేడు. వయసు సుమారు యిరవైమూడు సంవత్సరాలుంటాయి. యిటువంటి కొత్త వకీళ్ళకే దావాలు వొప్పజెబితే వుభయత్రా లాభిస్తుందని సరవన్న వుద్దేశం. సరవన్నను చూసి సారంగపాణి నమస్కారం అందుకుని, "ఏమండీ సరవన్నగారూ! ఏం విశేషం? అతడెవరు?"

"చిత్తం. అతనిగురించే తమ దరిసెనానికి వొచ్చేను. తమకు తీరుబాటుగావుంటే యీ లంచి యింటర్వెలులో తమతో చిన్న సలహా చెయ్యాలని వొచ్చాం."

---

పేరు మోసిన డాక్టరుగారు ఆవేళ పెళ్లాన్నీ బిడ్డల్నీ వెంటబెట్టుకొని బీచికి షికారు వెళ్లారు. అక్కడ ఎవరో వన్నెల విసనకర్ర ఎదురై డాక్టరుగారి కేసి చూసి ముసిముసి నవ్వులు నవ్వి, ఒక దణ్ణం పారేసి వెళ్లిపోయింది.

డాక్టరుగారి భార్య డాక్టరుగారిని అడిగింది— "ఈవిడ ఎవరూ" అని.

"ఆఁ! ఎవరో! వృత్తి ధర్మాన్ని బట్టి తారసిల్లాం. అంతే!" అన్నాడు.

"ఎవరి వృత్తి ధర్మం?" అని ఆవిడ అడిగింది.

---

అమృతమువంటి

**అనంగప్రభాయాకుతి**

సుందరమైన యౌవ్వనావికి. ప్రకాశవంతమైన తేజస్సుకు ఉత్తమమైనది, ధాతువును గట్టిపరచి వృద్ధిచేయును బలహీనతచెందిన నరములకు శక్తినిచ్చి, పటుత్వమును చేకూర్చును. సుఖమైన దాంపత్యజీవితమునకు ఉత్తరవాదముగలసంజీవి.

30 మాత్రలు రు. 10, 15 మాత్రలు రు. 5.

మదనమంజరి ఫార్మసీ

184, చైనాబజారు రోడ్డు, మద్రాసు.

బెజవాడ-శ్రీనివాస మెడికల్ స్టోర్సు పార్కురోడ్డు

రాజమండ్రి-ఈశ్వరదాస్ & కో. మెయిన్ రోడ్డు

నెల్లూరు:- ఆర్యన్ ఫార్మసీ-ట్రంకురోడు

ఇతర కేంద్రాల్లో ఏజెంట్లు కావాలి.

"తీరుబాటా! ఆ మాట మన భాషలో వుందా? చచ్చిపోవాలంటే తీరుబాటు లేదు. సబుకోర్టులో వొక విడో తరఫున వారసత్వం అప్పీలు పడేశాను. హీరింగు అవుతున్నాది. ముఖ్యమైన సాక్షిని విచారణ చేస్తున్నాను. జడ్జీగారు లంచికైనా దిగకుండా పది నిమిషాలు టైమిచ్చేరు. మీరొచ్చిన పనేదో వేగం తేల్చియండి."

"తమరు టిఫిను చేస్తూవుంటే మనవి చేస్తాను. తమకు వున్న పని నాకు తెలియదూ? ఓయ్! సన్యాసీ, వకీలుగారికి ఆరిడ్డెన్లు, నాలుగు దోసెలు, రెండు మైసూరుపాకులు, రెండు ప్లేట్లు బాదం హల్వా, రెండు కప్పుల కాఫీ, పాలఘాటు కాఫీక్లబ్బు కెళ్లి పట్రా. రెండు మంచి మిరాకిల్లీలు కూడాను. నీకివన్నీ జ్ఞాపకం వుంటాయో లేదో" అని వొక చీటీ వ్రాసి, రెండు రూపాయిలు చేతిలో పెట్టి పంపించేడు. తరవాత సరవన్నా, వకీలుగారూ బారు రూంలో వొక బెంచీమీద కూర్చున్న తరవాత వకీలుగారు "ఏమిటండీ దావా?" అన్నారు.

"యీ రైతుతాలూకు పొలంలో సుమారు పది సెంట్లు పొరుగునున్న రైతు దురాక్రమణ చేసేడు. అందుకు దావా."

"ఎలాగ చేసేడూ?"

"తనపొలంగట్టు పాడైపోయిందని, అది తీసి వేసి కొత్తగట్టు వేయించే మిషమీద యీ పదిసెంట్లూ ఆక్రమించేడు."

"యిందులో విశ్వామిత్ర సృష్టి యేమీ లేదుకద. ఏమాత్రమైనా అబద్ధం వుంటే యీ కొత్తమునసబుగారు వుగ్రుడైపోయి కేసుకొట్టేయడమే కాకుండా పార్టీని పెర్జరీ నేరం కింద ప్రాసిక్యూషను కి కూడా ఆర్డరువేస్తారు."

"అలాంటిదేమీ లేదు. అయినా దావా బలంకోసం చిల్లర, చిల్లర సాక్ష్యాలు పంపన్నాలు బనాయించాలి. యెంత నిజమైన దావా అయినా కొంచం అబద్ధంకలియందీ బలపడదు కదండీ. ఎంత మంచి? బంగారమైనా కొంచం రాగి కలిస్తేనేగాని గట్టిపడదు."

"అయితే మనఫీజెంత నిర్ణయించారు?"

"చిత్తం. దావా ఆస్తి విలువ తక్కువ. రైతు బీదవాడు. తమరు చూస్తూనే వున్నారు, తమ టిఫినుకోసం డబ్బు నేనే యిచ్చేను. అంచేత సెంటుకి రూపాయి చొప్పున పదిరూపాయీలకు కుదిర్చేసరికి నాతాతలు దిగొచ్చేరు."

"యింతేనా! యీ భాగ్యానికి నన్నెందుకు చంపుతారయ్యా!"

"తమరలా అనకూడదు.-చిన్నా, పెద్దా అనకుండా యేదివస్తే అది వకాల్తా పట్టితే గాని ప్రాక్టీసు అంటుకోదు. తమది పిన్న వయస్సు. నేను చెప్పినది తోసెయ్యకండి. మధ్యదారిలో గున్నయ్యగారడ్డితే తప్పించుకుని తమవద్దకే వొచ్చేను. కేసు గెలిస్తే మరింత ముట్ట జెప్పిస్తాను."

సన్యాసి టిఫిను తెచ్చింతరవాత వకీలుగారూ సరవన్నా యిద్దరూ టిఫిను తిని, వకాల్తా ఫారంమీద సన్యాసి వేలుముద్ర వేయించినతరవాత లాయరుగారు కోర్టు హాలుకీ, సరవన్నా, సన్యాసీ సరవన్నా కొట్టుకీ వెళ్ళేరు. అక్కడ సన్యాసి, "బాబూ! ఆ వొకీలెక్కడ దొరికేడు తవురికి. పుల్లిపిచిక నాగున్నాడు. గొంతుక నేదు. మాట తడుముకుంటున్నాడు. నారాయణరావు, అప్పారావు గోరిలాంటి వొకీళ్ళకిస్తే బావుండునేమో."

"ఆ! వాళ్ళదరిసెనం దొరకదు. దొరికిందా నూరురూపాయీల నోటు కనపడితేగాని మనవేపు చూడరు. మన దావా బలమైనదీ, నిజమైనదీని. ఏవకీలు పట్టినా




S. 200-50 TL

# ★ వేరుపురుగు ★

బుబువుగా కర్చులతో సహా డిక్రీవొస్తుంది. అదిగాక, సారంగపాణిగారంటే లాకొయి లూకొయి వకీలనుకున్నారేమి. ఆయన మద్రాసులో వొక సంవత్సరం ప్రాక్టీసు చేసేరు. (ఎప్రెంటిసు!). అప్పుడు జడ్జీలకే తప్పులు దిద్దితే, ఎలాగైనా వొదిలించుకుందామని వెంటనే డిస్ట్రిక్టు జడ్జీ పనియిప్పిస్తాం వెళతారా అంటే, అది తన స్వేచ్ఛకి ఆటంకం కలిగిస్తుందని, వొద్దని, అక్కడుంటే వాళ్ళతో రోజూ తగువే అని యిక్కడికి వొచ్చేసేరు. మనిషి చిన్నయితేనేం, గొంతుక చిన్నదైతేనేం; వొక్కొక్క లాపాయింటు తీసేసరికి అంత జడ్జీగారూ ఆగవలసిందే. చీమిర్రపుకాయ చిన్నదికాదూ. ఆయన్ని దావా వకాల్తాకి వొప్పించేసరికి నాతల ప్రాణం తోక్కొచ్చింది. నువ్విచ్చిన యాభైరూపాయిలూ ఫీజుకింద బతిమాలుకుని యిస్తేనేకాని పుచ్చుకోలేదు. టిఫినుకిచ్చిన రెండురూపాయీలు నా చేతివే. రేపు వుదయమే మనం ఆయన యింటికెళ్ళి కాయితాలన్నీ రాయించాలి. వాలంటరీకి పదిరూపాయిలు పట్టుకొనిరా, నామాటకేం. దావా గెల్చి మళ్లా నీభూమినీకొస్తే నాకంతే చాలు."

చీకటిపడే వేళకి వాళ్లిద్దరూ కలిసి ఆరామం వెళ్లిపోయేరు. ఆ రాత్రి. సరవన్న భోజనంచేసి వీధరుగుమీద కూర్చునివుండగా నూరన్న, చలికి వొక పచ్చడం కప్పుకుని, వొక దుప్పటీ తలకిచుట్టి, వొకచేతిలో పెద్ద బాపాటికర్ర, వొకచేతిలో హరికేను లాంతరుతో వచ్చి సరవన్నకు దండంపెట్టి కొంచెం దూరంగా కూచున్నాడు.

"బాబూ! సన్యాసి మాటేటి? తమకేమైన తెల్సిందా?" అనడిగేడు.

"మనం అనుమానించినట్టే చేసినట్టుంది. సబినస్పెక్టరుగారూ, సారంగపాణిగారు కనుపించి చెప్పేరు. సివిలూ, క్రిమినలూ కూడా జరిపిస్తున్నట్టున్నాది."


## నారసింహలేహ్యము




బంగారు చేర్చబడినది. మేహము, నిర్బలత, నిస్సత్తువ, శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 12 అ.

పి. సి. ఏ. శ్రీకంపెని. "ఆయుర్వేదసమాజం" పెరిదేపి-నెల్లూరు జిల్లా.


"మరెలాగ. తంరే దకలు పుచ్చుకుని రచ్చించాలి" అని కొంచెం ఆలోచించి, "మా పెద్దయ్యతో సెబితే యేటైనా సేస్తాడేమో?"

"నీయిష్టం. అలాగే సెయ్యి. నన్నడిగిన భోగట్టా నేను చెప్పేను. అయినా నూరన్నా! వొక సంగతి చెప్తాను. కోప్పడకుండా విను. పెద్దయ్యంటే నాకూ గొప్ప గురే. దేవుళ్లాంటివాడు. కాని అతనికి పురాణాల్లోను, వేదాంత గ్రంథాల్లోను ఏముందో తెలిసినట్టు కోర్టులూ, కేసులూ, పేచీలు ఏం తెలుస్తాయి? అతణ్ని సలహా అడిగేవనుకో. రాములవారంతటివారికే కష్టాలొచ్చేయి. కృష్ణభగవాన్లకీ నీలాపనిందలొచ్చేయి. మనమనగా యెంత; వొచ్చిందేదో దైవంమీద భారంవేసి అనుభవించాలి, అని వేదాంత చెప్తాడు. కాని పేచీకి పైపేచీ వెయ్యలేడు. నిజమేనా?"

"నిజమే బాబూ. అయితే నన్నేటి సెయ్యమంటారు?"

"రేపు వుదయం చల్లంది తిని తిన్నగా రాజపురం వెళ్ళి నా ఆఫీసుదగ్గిరుండు. చేతిలో వో యాభైరూపాయిలు పట్టుకురా. నేను వొచ్చి తక్కిన పనంతా చేస్తాను."

"ఏటిసేస్తారు బాబూ! రూపాయిలెందుకూ?"

"ఓయ్ వెర్రివాడా! డబ్బులేకపోతే నిన్నూ, నన్నూ చూసేవాళ్ళెవరు? అది వుంటే కొండని పిండిచెయ్యగలం. మొట్టమొదట మనం వెళ్ళి హెడ్డుగారిని కలుసుకుని మాట్లాడాలి. తరవాత గట్టి వకీలుని పెట్టుకోవాలి."

"సబినసపెకిటోరిని మానేసి హెడ్డుగోరెందుకు బాబూ?"

"నీకేం తెలుసు. పనంతా నడిపించేవాడు హెడ్డు. సబినస్పెక్టర్లు, ఇనస్పెక్టర్లు గుళ్లో దేవుళ్లలాగ కూచుని పనంతా వీళ్ళచేత చేయిస్తారు. యీసవాళ్లన్నీ యెందుకూ? వొక్కమాట చెబుతాను విను. నీకీ గ్రంథం నడిపించడం యిష్టమై, నామీద నమ్మకం వుంటే నేను చెప్పినట్టల్లా చెయ్యి. లేకపోతే వొక దండం పెట్టేసి, నీ యిష్టం వొచ్చిన వాళ్ళ సలహా తీసుకుంటావో, చేతులు ముడుచుకుని కూచుంటావో, నీకు తోచినట్టూ చెయ్యి. నాకు నిద్దరొస్తున్నాది. వుదయం వేగంగాలేచి చాలా కాయితాలు రాసుకోవాలి."

"తంరు సెప్పినట్టూ సేస్తా బాబూ. ఎలాగైనా రచ్చించాలి."

"నీకు భయమేమిటీ! నువ్వేమైనా ద్రోహం చేస్తేకదా."

"తంరికి తెల్దా? అంతటికీ తంరే వున్నారు." నూరన్న కళ్లాని కెళ్లిపోయేడు.

మర్నాడు సరవన్న కొంచెం ముందుగానే రాజపురంవెళ్ళి నూరన్న రాగానే అతను తెచ్చిన యాభైరూపాయిలూ పుచ్చుకుని పోలీసుస్టేషనుకు బయల్దేరి వెళుతూ వుండగా దారిలో హెడ్డు కనబడగానే ఇద్దరూ నమస్కారంచేసి నిలబడ్డారు.

"ఏమండీ సరవన్నగారూ! యీ పక్షీ యెవరు? ఏమిటి సంగతి?"

హెడ్డుకి కంటితో సంజ్ఞచేసి, "చిత్తం! తమ దరిసెనానికే వెళ్తూవుంటే వెతకబోయిన తీగ కాళ్లకి తగిలిందన్నట్టు తమరే యెదురుపడ్డారు. తమరు నిలుచునేవున్నారు. అలా రీడింగు రూములోకి దయచేయండి. వో ముఖ్యవిషయం తమతో మాటాడాలి. ఏమోయ్ నూరన్నా. హెడ్డుగారికి వో మంచి ఆరెంజిబుడ్డీ కొట్టించి గ్లాసులో పోయించి, వొక కత్తెరమార్కు సిగరెట్టు పెట్టే, వొక అణామిఠాకిల్లీపట్టా. పక్కవీధిలో బంగారయ్యదుకాణంకి వెళ్లు. మంచివన్నీ అక్కడుంటాయి. యీ రూపాయి తీసుకెళ్లు."

రూపాయిచ్చి నూరన్న నిపంపించిన తరవాత యిద్దరూ రీడింగురూంలో కుర్చీలపైని కూచుని మాటలారంభించేరు. "ఏం బాబూ ఏమిటిసంగతీ?" అన్నాడు హెడ్డు.

"ఏమీ లేదు. యీ నూరన్న తన పొరుగురైతు సన్యాసితాలూకు పొలం ఆక్రమించేడనీ, ఆ సందర్భంలో అతణ్ని నానా తిట్లూ తిట్టి మెడబట్టి గెంటించేడని ఫిర్యాదు. అది దర్యాప్తుచెయ్యడానికి మిమ్మల్ని పంపుతానని సబినస్పెక్టరుగారు శలవిచ్చేరు. అదేదో మీరు తేల్చేయాలి."

"నిన్న నా సన్యాసితాలూకు ఫిర్యాదు కూడా మీరే దాకల్చేయించినట్టుందే? కుడీ యెడమా కూడా వాయిస్తున్నారే."

"ఏవాయింపూ లేకపోతే బతకడం యెలాగ? మీ వంటి ఆఫీసర్లస్నేహం సంపాదించడం యెలాగ?"

"పెద్ద హోదాయిచ్చేరే. మీ నోటివాక్యాన్ని అలాగే అయితే యింకో క్వారటు సంపాదిస్తాను."

"తప్పకుండా తమరు కాకపోతే మరెవరున్నారవడానికి? మరి యీతగవు మాటేంజేస్తారు?"

"అయితే యెంతపొలం ఆక్రమించేడని తగువు? పెట్టుకోవలసిన అర్జీ తయారైందా?"

"ఏమాత్రమండీ. అయిదురైన్లు."

"యింతేనా ? దీనికోసమేనా ఎండలో దేవుడా అని మైలున్నర నడిచి తిప్పట పడ్డం ?"

"చిన్నదని వొదిలేస్తారా? చిన్నదొస్తే చిన్నదీ, పెద్దదొస్తే పెద్దదీ పరిష్కరించాలి. రైతు మోతుబరి కాడు. కటాక్షించండి. అర్జీ యిదిగో కవరులో వుంది."

పుచ్చుకుని "సరే. రేపుసాయంకాలం వొస్తాను. మూడుగంటలకి. అయితే అవతల పార్టీ మాటేంజేస్తారు ?"

"అతడప్పుడే సివిలు నడిపిస్తున్నాడు. రేపు మీ రొచ్చేవేళకి నేను బాజోసై పోతాను. వుభయపార్టీలూ మీ చేతిలో వుంటారు. మీకే యెలాగో వోలాగ చూసుకుని పరిష్కరించండి."

నూరన్న ఆరెంజి వగైరాలు తెస్తే అవి ఆరగించి పోద్దు, "నూరన్నా ! నీకూ సన్యాసికీ రేపు సాయంకాలం మూడుగంటలకి మీ వూరుసంతబయలులో హాజరుగా వుండమని తాఖీదులు యీవేళ పంపుతాను. మీరు వెళ్లండి. రాంరాం."

సరవన్నా, నూరన్నా కలిసి వకీలు గున్నయ్యగారింటికి వెళ్తూవుంటేదారిలో నూరన్న "బాబూ ! ఏ వొకీలుగారికాడ కెల్తున్నారు? పెద్దవొకీళ్లయిళ్లన్నీ దాటేసినామే ?"

"ఎడ్వొకేటుగున్నయ్యగారింటికోయ్."

"గున్నయ్యగారంటే ఆ కుర్రోడు గాదా ? అరికేటితెల్చును బాబు యీ చిక్కులు ?"

"చాల్చాలు! ఆయన ప్రజ్ఞ నీకేంతెలుసు. నెల్లాళ్ళకిందనే వొక దావా హైకోర్టు వరకూ వెళ్లి మళ్లా యీ కోర్టుకు రిఫరైంది. పార్టీ అదృష్టంకొద్దీ నాదగ్గిరకి సలహా కొచ్చేడు. వెంటనే నేను గున్నయ్యగారికా దావా వొప్పజెప్పేను. అందులో ఆయువుపట్లు మూడే పాయింట్లు తీసి వాయిదా నాటికి రెడీఅయి వాటిమీద అరగంటసేపు ఆర్గ్యుమెంటు చెపితే బారు బారంతా నిశ్చేష్టులైపోయేరు. జడ్జీగారు కూడా హైకోర్టులో తెగని చిక్కు యిట్టే విడదీసేరని మెచ్చుకుని వెంటనే పార్టీ పక్షంగా డిక్రీయిచ్చేసేరు. అసలు గవర్నమెంటువారీయనకి డబ్బిచ్చి పైచదువుకి యింగ్లాండు, అంటే సీమదేశం పంపుతామంటే ముసలి తల్లిదండ్రులమీద భక్తికొద్దీ వారికోసం యిక్కడే ప్రాక్టీసుపెట్టేరు. నూరన్నా ! వొక్కమాటచెబుతాను విను. నేను యెంచిన వకీళ్లు లాకాయ లూకాయ గాళ్లు కారు."

నూరన్నకు గట్టినమ్మకం కుదిరింది. వుత్సాహంగా వకీలింటికి వెళ్లేరు. అక్కడ వకీలుగారిప్రైవేటురూంలోకి సరవన్న వెళ్లి, సంగతిచెప్పి ప్లెయింటు దాకలైంతరువాత కాపీతీసుకుని స్టేటుమెంటు తయారు చెయ్యిచ్చునని ఆయనకు పదిరూపాయిలు ఫీజుయిచ్చి, పైకి వొచ్చి, నూరన్న చేత వేలుముద్రలు వేయించాడు. బయటకొచ్చేక



# ★ వేరుపురుగు ★

సూరన్న "బాబూ రెండురూపాయిలిస్తారా? పండక్కి అల్లుడొస్తాడు మా యమ్మికి సిలుకుజాకిట్టు కొంటాను." అన్నాడు.

"రెండురూపాయిలా! నువ్వు వూన్నా నే వున్నావు నీయాభై యెలాగ కర్చయేయో. వకీలుని అరగంట కుండకొడితే నే గాని యాభైకి వొప్పుకోలేదు. యింకా ఆయనకి పదిరూపాయిలు బాకీపెట్టేను. హేడ్డుగారి సోడా వగైరాలకి నా చేతిరూపాయిచ్చేను. నువ్వువెళ్లు. నాపనులు చూసుకుని సాయంకాలానికి యిలు చేరుకుంటాను. యీ వేళ యిక్కడే వొటేలులో భోంచేస్తానని మా యింటిదగ్గిర చెప్పు."

సూరన్న తనకు తెలిసినవాడుంటే అతనివద్ద అప్పుచేసి మంచి పట్టుజాకెట్టు కొని యింటికి పంపించి తాను కళ్లానికెళ్లేడు.

## 4

ఆరోజున సూరన్న కళ్లానికెళ్లి వొక చిన్నకుప్ప నూర్పించి, గాలికి పోయించి, ధాన్యం బండి కెత్తించి, యింటికి సుమారు రాత్రి పది గంటలకి వొచ్చేడు. దారిలో, తనపైన అన్యాయంగా వొచ్చిన తగాయిదా గురించే విచారిస్తూ వొచ్చేడు. అతని భార్య వెంకటలక్ష్మి మేలుకుని వుంది. ధాన్యం కొట్లోపోయించి భార్య యిచ్చిన వేడినీళ్ళతో స్నానం చేసి భోజనం చేస్తూవుండగా వెంకటలక్ష్మి భయపడుతూ సాయంకాలం పోలీసు కనిస్టేబు లొచ్చి, మర్నాడు సాయంత్రం మూడు గంటలకి సంత బయలులో తప్పకుండా హాజరవాలనీ, హేడ్డుగారొస్తున్నారనీ చెప్పి వెళ్ళేడని చెప్పి, యిదంతా యేమిటని అడిగింది. జరిగినసంగతంతా భార్యతో చెప్పాడు సూరన్న.

"మామా! యీ తగువు పెద్దయ్యతో చెప్పితే ఆ సన్నాసిగాడి నోట్లో గడ్డెట్టి బుద్ధి చెప్తారు. ఆ పాపిష్టోడు సరవన్నకాడి కెందుకెళ్లినావు" అంది వెంకటలక్ష్మి.

"సన్నాసి, సివ్విలు, కిరిమినేలు, సేసేడు. పెద్దయ్య గుమ్మం దాటి బైటికెల్లనోడేటి సేస్తాడు? సరవన్నకి కోరట్ల యెవ్వారాలు బాగా తెల్సు. అయినా రేపు హేడ్డొచ్చెళ్లింతరవాత యీ గోరం పెద్దయ్య సెలినేస్తాను." సూరన్న కళ్ళానికి వెళ్లిపోయేడు.

మర్నాడు సాయంకాలం సైకిలు మీద హేడ్డుగారు వొచ్చేసరికి సూరన్న సంత బయలులో హాజరుగావున్నాడు. సన్నాసిని తిన్నగా తగాయిదా పొలానికి రమ్మని వొకపశువుల కాపు కుర్రాడిచేత కబురంపి, వీరిద్దరూ అక్కడికి రెండు ఫర్లాంగుల దూరంలో వున్న పొలానికి వెళ్ళేరు. హేడ్డు పొలంగట్టు మీద యీ చివరనుంచా చివరకి నడిచి వొచ్చి—అన్నాడు.

"సూరన్నా! కొత్తగట్టు వేసేవే. వేసినప్పుడు సన్యాసితో చెప్పేవా, అతడిష్టపడ్డాడా?"

"నాగట్టు నేను బాగుసేసుకోడానికతగాడిష్టమేటి బాబూ. అయినా సన్నాసితో సెప్పే యేసినాను."

"అయితే అత డడ్డుపడలేదూ?"

"నేదుబాబూ."

"అయితే అప్పుడు తనుఅడ్డినట్టు, అప్పుడు నువ్వూ, కూలివాళ్ళూ అతణ్ని మెడపట్టి గెంటివేసి నానాతిట్లూ తిట్టేనట్టూ ఫిర్యాదు చేసేడే. అడుగో సన్యాసి వొస్తున్నాడు. అతణ్ణికూడా దర్యాప్తుచేస్తాం". యింతలో సన్యాసి వొచ్చాడు. హేడ్డు "ఏమోయ్! సరవన్న యెక్కడ?" అని అడిగాడు.

"నాకు తెల్దుబాబూ."

"అయితే నీ ఫిర్యాదులో సంగతులన్నీ నిజమేనా?"

"నిజమే బాబూ"

"సాక్షులెవరు?"

"నా వొక్కణ్ణే వుంటే యీ మాయదారి పనిసేసినాడు."

అప్పుడు సూరన్న "సన్నాసీ మాలచ్చింమీద నిలబడున్నావు. అబద్దాలాడితే తలపగులుద్ది." అనగానే హేడ్డు, "చప్! మేం దర్యాప్తు చేస్తూవుంటే మధ్యనీ క్రొపేమిటి? నువ్విలాగారా" అని కొంతదూరం తీసుకొనివెళ్ళిన—

"సూరన్నా! నువ్వు అతడి పొలం ఆక్రమించినట్టు నిదర్శనాలు చాలా వున్నాయి. ఏమంటావు?"

"అంతా అబద్దం బాబూ. అమ్మోరి గుళ్ళో పెమాణంసేస్తాను. దేముడితోడు."

"అమ్మోరు, దేవుళ్లూ యీ రోజుల్లో పలుకుతారటోయ్. కీలకం అంతా మన దర్యాప్తు రిపోర్టులో వుంది. అటుపైగ్రంథం అంతా దానిపైని ఆధారపడుతుంది"

"తమ సెలవైతే అలాగ సేస్తాను బాబూ. రచ్చించాలి."

హేడ్డు అతనితో ఏదో చెప్పి గట్టిగా, "సరే నువ్వు, ఇంటికివెళ్లి ఏమి చెప్పదలుంటావో అంతా రాయించి వొక కవరులో పెట్టి తీసుకునిరా. యీలోపున సన్యాసిని కూడా దర్యాప్తుచేసి రిపోర్టు రాస్తాను."

సన్యాసి దగ్గిర కొచ్చి, "ఏమోయ్! సాక్ష్యంలేని ఫిర్యాదు చేస్తావా? మరో తడవ మళ్లీ రచ్చకీడుస్తావా! జాగ్రత! ఫాల్సురిపోర్టు కింద నిన్నిప్పుడే యెరస్టుచేసి కొట్లో వేస్తా"నేసరికి సన్యాసి గడగడలాడిపోయాడు "చిత్తం! రచ్చించినా, చంపినా తంరే పెబువులు. ఏటి సెయ్యమంటే అది సేస్తాను. రచ్చించాలి." అనేసరికి సరేనని అతనితో కూడా కొంతసేపు మాట్లాడి అతన్ని కూడా యింటికి పంపి వాళ్లు తిరిగి వొచ్చేసరికి తన రిపోర్టు వ్రాసుకుని వాళ్లిచ్చిన కాయితాలు జేబులో వేసుకుని, కుషీగా రాజపురం వేపు సైకిలు తిప్పేడు హేడ్డు.

సన్యాసి యింటికిగాని, పొలానికిగాని వెళ్ళాలంటే పెద్దయ్య యింటిముందునుంచే వెళ్ళాలి. సూరన్న భార్య పెద్దయ్యతో ఆనాటిసాయంకాలమే జరిగినదంతా చెప్పియేడ్చింది. మర్నాడు సన్యాసి పొలానికెళ్తుంటే దారిలో పెద్దయ్య పిలిచి యీ విషయం అడిగేసరికి సన్యాసి కొంచెం చిరాకుగా "బూమి సూరన్నాక్రమిస్తే వొల్లకుంటానా?" అన్నాడు.

"అయితే దావా తెచ్చేవా? సరవన్న సలహాయేనా?" అన్నాడు పెద్దయ్య.

"ఆ! ఎవురికి కోరటు బోగట్టాలు తెలిస్తే ఆరి సలహా. పనుంది. యెల్లొత్తా."

అతనితో అప్పట్లో మాట్లాడితే కార్యం లేదని తరవాత సూరన్నతో చెప్పేడు పెద్దయ్య.

## 5

పండక్కి సూరన్న అల్లుడు రామమోహన్ వొచ్చేడు. అతడు ఆనర్సు చదువుతున్నాడు. సూరన్న కూతురు పద్మ కూడా ఎనిమిదోక్లాసువరకూ చదువుకుంది. పెద్దయ్య దగ్గిర అమరం కూడా చదివింది. పురాణాలు చదివి

**అబలసుధ**

స్త్రీల కుసుమ వ్యాధులు అకాల బహిష్టు, ఋతుబద్ధము, ఋతుశూల, ఒడలునొప్పులు, తలనొప్పి, గుండెదడ కాళ్ల లాగుట, మనస్థిమితము లేకపోవుట, నిద్రపట్టకుండుట, నడుమునొప్పులు, బలహీనత, మలబద్ధము, హిస్టీరియా మొ॥ హరించును.

సీసా రు. 3/- వి. పి. అ 0-14-0.

ఇండియన్ మెడికల్ హౌస్,

లక్ష్మీ టాకీసు రోడ్డు - విజయవాడ-2.

అర్థం చెప్పగలదు. పండుగరోజుల్లో అత డెక్కడికీ వెళ్ళకుండా అత్తవారింట్లోనే కాలం గడిపేడు. తగువు సంగతి తన మామ చెబితే ముక్కనుమునాడు రాజపురం వెళ్ళి పోలీసుస్టేషనులో అడిగాడు. సివిలు నేచరని కంప్లెయింటు రిఫరు చేసినట్టు తెలిసింది. యింటికొచ్చి పోలీసు భయంలేదని చెప్పేసరికి అందరూ సంతోషించేరు. కాని ఆరోజునే బేటామీను వొచ్చి సివిలుకోర్టు సమను లందజేసేడు.

పండగ వెళ్ళింది. వాయిదా ముందు రోజున సన్యాసి సరవన్న యింటికెళ్లి పోలీసువాళ్లు నీళ్ళు కార్చేసినందుకు నిష్ఠూరంగా మాట్లాడేడు. అందుకు ముఖ్యకారణం సాక్ష్యంలేదని సన్యాసి చెప్పడమేనంటూ, సబిన్స్పెక్టరు రాకుండా హేడ్డు దర్యాప్తుకి రావడం, ఆ సమయానికి తాను వూళ్ళో లేకపోవడం అన్నీ కలిసేయని చెబుతూ, సూరన్న దావా పొలం దున్నకుండా, ఎట్టి పైరూ ఆ పొలంలో పండించకుండా యింజంక్షను ఆర్డర్లు వేయిస్తానని చెప్పి సరవన్న అతణ్ని సముదాయించేడు. అట్టి ఆర్డర్లే సూరన్న తరఫునకూడా యిప్పిస్తానని అతన్నికూడా సంతోషపెట్టేడు. వుభయులనీ కోర్టురొంపిలో మెలబంటివరకూ దింపేడు. కేసు హియరింగుకి రాకుండా వొక సంవత్సరం వాయిదాలుపడ్డాయి. చివరికి మున్సబుగారు కర్చులతో సహా, గత రెండు సంవత్సరాల ఫలసాయంతో కూడా సూరన్న పక్షంగా డిక్రీ యిచ్చేరు. సూరన్నకి, సన్యాసికీ చెరి రెండేసి వేలు, వాయిదాలు, స్టాంపు ఖర్చులు, కోరుఫీజులు, బేటాలు, లోకలిన్స్పెక్షనులు, వగైరా పబ్లీకు ప్రెయివేటు కర్చులకింద ఖర్చయేయి. సన్యాసి తరఫున ముగ్గురు సాక్షులను సరవన్న కుదిర్చినా కోర్టువారు నమ్మకుండా పైప్రకారం డిక్రీ యిచ్చేరు. కేసు మొదటిలో సన్యాసికి, సూరన్న తన పొలం ఆక్రమించేడా, లేదా అని అనుమానం వుండేదికాని రానురాను సూరన్న తన పొలం ఆక్రమించేడనే నమ్మకం కలిగి, ఎవరెంత చెప్పినా, నిదర్శనాలు చూపించినా వినలేదు.

డిక్రీమాట విని గోలపెడుతూ సరవన్న దగ్గరకి వెళ్ళి సన్యాసి నానామాటలూ అనడానికి మొదలుపెట్టేసరికి సరవన్న,

"కోర్టులంటే యేమిటోయ్! దీనిమీద కోర్టులేదూ. మన మెక్కడికీ వెళ్లక్కరలేదు. రాజపురంలోనే వుంది. రేపే అప్పీలు దాఖలుచేయించి కర్చులతోసహా రాబట్టుదాం. నువ్వు జంకితే చెప్పలేనుగాని మనకేసు బలమైనది. అప్పీలులో తప్పకుండా గెలుస్తాం."

అప్పీలనేసరికి సన్యాసి "యిప్పటికే రెండువేలయింది. యింట్లో పుస్తె పూసా అమ్మేను. మిగిలిన భూమిలో సంగోరు తాకట్టెట్టే మళ్ళాకోరటా బాబూ."

"అయితే నీ కర్మం. సూరన్న డిక్రీ అమలుచేసి గత రెండేళ్ల ఫలసాయంకీ దావా పడేసి నీకొంపాగోడ్డీ వేలాం వేయించేస్తాడు. ఆలోచించుకో నీ యిష్టం."

ఇంక సన్యాసి లొంగిపోయి అప్పీలుకు కావలసినడబ్బు జాగ్రత్తచేసి సరవన్నకిచ్చేడు. యీ అప్పీలు మరి రెండేళ్లు నడిచి, ప్రొసీజరులో ఏవో లోపాలొచ్చేయని మళ్ళా కిందకోర్టుకి పునర్విచారణకొచ్చింది. అంతటితో సన్యాసి సాఫైపోయేడు. సూరన్న అప్పులపాలైపోయేడు.

ఇదంతా చూసి సహించలేక పెద్దయ్య వొకనాడు సరవన్న యింటికి వెళ్లేడు. అతణ్ని దూరంనించి చూసి, సరవన్న వొకచాప వేసి దయచెయ్యాలని ఆహ్వానించేడు. కూర్చున్న తరవాత సరవన్న —

"ఏమిలాగ దయచేసేరు పెద్దయ్యగారు?"

"సరవన్న గారూ! ఆ సన్యాసికీ, సూరన్నకీ తగువు యెంతకాలం పెంచుతారు? సన్యాసిఆస్తి పండు లాంటిది భస్మమైపోయింది. సూరన్న అప్పులపాలై పోతున్నాడు."

''నేనేంజేసేదీ? ముసద్దీవృత్తి చేసుకుంటూ యీలాటివి వొస్తే సలహాయివ్వడం తప్పేనా?''

''సరే నేనొక విషయం అడుగుతాను చెప్పండి. నిజంగా సూరన్న, సన్యాసి పొలం ఆక్రమించేడా?''

''నాకేం తెలుసు? వొకనాడు తనకట్టి అనుమానంవుందని నాతో చెబితే, పోనీ వోయ్ మూడడుగులే కదా వూరుకో అన్నాను. ఇంకా నన్ను పట్టుకుంటే వృత్తిధర్మం ప్రకారం సలహాయిచ్చేను.''

''సూరన్నకి మీ రేకగా సలహా యిచ్చేరు? అదీ వృత్తిధర్మమేనా?''

''ఆ! ఎవరడిగితేవాళ్ళకి తగిన సలహా యివ్వాలి ముసద్దీ అన్నవాడు.''

''మహా గొప్పవృత్తయ్యా! సరే నేను చెప్పేది అడ్డురాకుండా సాంతంగా విని ఆపైని మీకు అంతరాత్మ ఎలా చెబితే అలాగ చెయ్యండి. మొదట సన్యాసి బుర్రలో మీరే యీ అనుమానం పెట్టేరు. అమాయికుల్ని యిద్దర్ని పట్టుకుని పేరుపురుగులాగ వాళ్ల సంసారాలు పిప్పిచేసేరు. యింకా చెయ్యబోతున్నారు. మీకు కోపం రాకపోతే చెబుతాను. వాళ్ళవుసురు మీకు బాగా తగిలింది. యిప్పటికైనా మీరు సర్దుకోకపోతే యింకా బెడిసికొడుతుంది. మీకా పిల్లలులేక, పెంచుకున్న కొడుకు స్కూలుఫైనలు చదువుతూ నిరుడు పండుగరోజున హటాత్తుగా పోయేడు. మీ యిల్లాలు చూస్తే ఆరునెల్లయింది పక్షవాతంతో మంచమెక్కేరు. మీ అక్కగారు వొచ్చి యిల్లు చూడకపోతే మీ గతేంగాను? ఆమె మీకుచేస్తున్న సహాయానికి నన్నడిగితే, ఆమె కుమారుణ్ని మీరు బాగుచేసి చదువుచెప్పించండి. యేదో తగుమాత్రం ఆస్తిసంపాదించేరు. కొంతడబ్బు నిలవచేసేరు. యింకా యెవరికోసం యీ మాయవృత్తిచేసి నెత్తురుకూడు తింటారు? యిప్పటికైనా నామాట విని ఆ అమాయకులిద్దరికీ రాజీ చెయ్యండి. నేను వాళ్ళని పిలిచి చెప్పతాను. బాగా ఆలోచించుకోండి." పెద్దయ్య యిలా చెప్పి యింటికెళ్లేడు.

యిదంతా సరవన్న అక్కగారు విని పెద్దయ్య వెళ్లింతరవాత,

"తమ్ముడూ! పెద్దయ్యచెప్పినట్టు నీకేమిటి లోపం? అడ్డమైనవాళ్ల వెనకాలా కాయితాల కట్టలుపట్టుకుని దినమస్తమానం తిరగడమెందుకు? యింటిపట్టున కూచుని వ్యవసాయం చేయించుకుంటూ హాయిగా కాలం వెళ్లబుచ్చరాదూ? నీపెళ్లానికి మంచి మందిప్పించడానికి కూడా నీకు తీరుబాటులేదే, అదెలా గేడుస్తున్నాదో నీకేం తెలుసు? దానిఘోషకూడా నీకు చేటుతెస్తుంది." అని బోధించింది.

ఆరాత్రి సరవన్నకినిద్రలేదు. మరి మూడు రోజులు రాజపురం వెళ్లకుండా యింట్లోనే వుండి, దీర్ఘాలోచనలో పడిపోయాడు. నాలుగోనాడు పెద్దయ్యదగ్గిరకెళ్లి, సన్యాసినీ, సూరన్ననీ పిలిపించి, పెద్దయ్య సహాయంతో వాళ్లిద్దరినీ వొప్పించి రాజీచేయించి ఆనాడే కోర్టులో రాజీనామా దాఖలు చేయించి దావా విత్‌డ్రా చేయించేడు. సూరన్నకి దావాకర్చులలో సగం యిచ్చుకోడానికి సన్యాసి వొప్పుకున్నాడు. పెద్దయ్య తనతాలూకు భూమిలో పదెకరాలు సన్యాసికి తక్కువ శిస్తుకిచ్చి, పంటలో కొంత యేటేటా సూరన్నకి బాకీ కింద జమకట్టడానికి వొప్పించేరు. ఆరోజు నుంచీ రాజపురంలో ఆఫీసు మూసివేసేడు సరవన్న. ★

**కుష్ఠు ★ బొల్లి**

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "శాస్త్రాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.